సాక్షి తిరుపతి

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



ఐఏఎస్‌లకు బదిలీ వీడ్కోలు

జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న జేసీ శుభం బన్సన్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాను కలెక్టరేట్‌లో సత్కరించారు. - IIలో



'పత్తి గుట్ట'లో మట్టి దోపిడీ

చంద్రగిరి సమీపంలోని పత్తిగుట్టను టీడీపీ నేతలు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. మట్టిని తరలించేస్తున్నారు. - IIలో



తట్టోడు గుంట దర్జాగా కబ్జా

రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని తట్టోడు గుంటను టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా కబ్జా చేసేశారు. - IIలో

న్యాయం గెలిచింది!

సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్‌లో ఎట్టకేలకు న్యాయమే గెలిచింది. కూటమి ప్రభుత్వానికి కోర్టు తీర్పు చెంపపెట్టులా మారింది. పోలీసులను అడ్డుపెట్టుకుని సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలను యావత్ ప్రజానీకం తప్పుపడుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం ప్రజాస్వామ్యంలో సరికాదని సూచిస్తోంది. సంక్షేమం విస్మరించి వేధింపులకు దిగడం పద్ధతి కాదని స్పష్టం చేస్తోంది. సర్కారు విధానాలను ప్రశ్నించే అధికారం ప్రతి ఒక్క పౌరుడికీ ఉంటుందని వెల్లడిస్తోంది.



నవీన్, చంద్రశేఖర్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

అసలేం జరిగిందంటే!

తిరుపతిలో మద్యం ఏరులై పారుతోంది. మద్యం సేవించిన కొందరు రోడ్డుపై పడి ఉండడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ వీడియోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నవీన్, చంద్రశేఖర్ వెంకటేష్ వైరల్ చేశారని కూటమి నేతలు ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి చేశారు. కూటమి నేతల ఒత్తిడితో సోమవారం వారిద్దరిపై ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్ను సవాల్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో రిమాండ్‌ను తిరస్కరిస్తూ మూడో అదనపు జూనియర్ జడ్జి తీర్పు ఇచ్చారు.

సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్‌ని తిరస్కరించిన కోర్టు

- 41 నోటీసులు ఇస్తే సరిపోతుందని స్పష్టీకరణ
- పోలీసుల తీరును తప్పుపడుతున్న ప్రజలు
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆరోపణలు



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టును తిరుపతి మూడో అదనపు జూనియర్ జడ్జి తిరస్కరించారు. 41 నోటీసులు సరిపోతాయని వెల్లడించారు. న్యాయస్థానం తీర్పుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై తిరుపతి వాసులు మండిపడుతున్నారు. అధికారాన్ని ఉపయోగించి సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 41 నోటీసులు ఇచ్చి విడిచి పెట్టాల్సిన కేసులో సోషల్ మీడియా కార్యకర్తలు నవీన్, చంద్రశేఖర వెంకటేష్‌ని టెర్రరిస్ట్‌లను అరెస్ట్ చేసినట్టు ముసుగులేసి, రోడ్లపై నడిపిస్తూ కోర్టులో హాజరుపరచంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. వారిద్దరి రిమాండ్‌ను న్యాయస్థానం మంగళవారం రాత్రి తిరస్కరించింది.

వ్యక్తిగత పూచీ కత్తుపై విడుదల

తిరుపతి లీగల్: తిరుపతి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకుడు బ్యంగి నవీన్ అలియాస్ నాని, తిరుపతి, ఎంఆర్ పల్లి, శాంతినగర్కు చెందిన సి.వెంకటేష్ పై ఈస్ట్ పోలీసులు నమోదు చేసిన కేసులో వ్యక్తిగత పూచీ కత్తుపై ఇద్దరినీ విడుదల చేస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ జడ్జి సంధ్యారాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు యుగంధర్ రెడ్డి, కొత్తపల్లి విజయ్కుమార్, ఐ.చంద్రశేఖర్ రెడ్డిలు వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో 41 ఏ నోటీసు ఇవ్వాలని తీర్పు ఉండగా పోలీసులు రిమాండ్‌కు తీసుకు రావడం చట్టవిరుద్ధమన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అణగదొక్కడం సరికాదు

ప్రభుత్వ విధానాలు సక్రమంగా లేకుంటే ప్రతిపక్ష పార్టీ ఎండగడితేనే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు స్పష్టం చేస్తున్నారు. విమర్శలను పాలకులు సానుకూలంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అలా కాకుండా తప్పులను ఎత్తి చూపిన వారిని కేసులతో వేధించడం, ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కేందుకు యత్నించడం సరికాదని వెల్లడిస్తున్నారు. బెల్ట్ షాపులను అరికట్టడం వదలేసి ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

పోలీసులను అడ్డుపెట్టుకుని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిరంకుశంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని విమర్శిస్తున్నారు. అందులో భాగంగానే తిరుపతిలో ప్రతిపక్ష పార్టీ నేతలను వేధిస్తున్నారని, అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తున్నారని వెల్లడిస్తున్నారు. పోలీసులు సైతం కూటమి నేతల కళ్లలో ఆనందం చూసేందుకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు బ్యంగి నవీన్, చంద్రశేఖర్ వెంకటేష్‌ను అదుపులోకి అవమానించారని వివరిస్తున్నారు. ఐటీ కేసులో అరెస్ట్ చేసిన వ్యక్తిని టెర్రరిస్టు మాదిరిగా ముసుగు వేసి మీడియా ముందు హాజరుపరిచారని విమర్శిస్తున్నారు.



వైఎస్సార్‌సీపీ నేతలతో ఆనందం పంచుకుంటున్న అభినయ్‌రెడ్డి

న్యూస్‌రీల్

ఐజర్‌కు ఎస్‌బీఐ భారీ విరాళం



అంబులెన్స్‌ను అప్పగిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్)కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.23.60లక్షల విరాళం అందించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఐజర్‌లో మౌలిక వసతుల కల్పన ఈ మొత్తం అందజేసింది. ఇందులో అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ.15.38లక్షల విలువైన అంబులెన్స్, క్యాంటీన్ సేవల మెరుగుపరిచేందుకు రూ.8.22లక్షల విలువైన ఆటోమెటిక్ కియోస్క్ వ్యవస్థను వితరణ చేసింది. మంగళవారం ఈ మేరకు ఎస్‌బీఐ ఉన్నతాధికారులు రాజేష్‌కుమార్ పటేల్, అమరేంద్రకుమార్ సుమన్, దినేష్ గులాటీ చేతుల మీదుగా ఐజర్ ప్రతినిధులకు అందజేశారు.

'సంతకాల'తో ప్రజా ఉద్యమం



సంతకాల సేకరణలో నూకతోటి రాజేష్ తదితరులు

నాగలాపురం : మెడికల్ కళాశాల ప్రైవేటీకరణపై కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం చేపట్టామని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్పష్టం చేశారు. మంగళవారం నాగలాపురంలో కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 17 వైద్య కాలేజీలను ప్రైవేటు పరం చేయాలన్న కూటమి సర్కారు నిర్ణయం సరికాదన్నారు. గత ప్రభుత్వం 6 కళాశాల నిర్మాణం పూర్తి చేసిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. దీనిపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి, సంతకాల సేకరిస్తున్నామని వెల్లడించారు. పేద విద్యార్థుల జీవితాలతో సీఎం చంద్రబాబు ఆటలాడుతున్నారని మండి పడ్డారు. దుర్మార్గపు ఆలోచనలను పక్కన పెట్టి ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, నేతలు అపరంజిరాజు, చిన్నదొరై, శ్యామ్, జగదీష్ రెడ్డి, మహేష్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, మోహన్ మొదలియార్, కులశేఖర్ రెడ్డి, వజ్రవేలు, షాబుద్దీన్,ఈశ్వర్, దానివేలు, ఏలుమలై, బాబు, చిరంజీవి, ఉదయ్ కుమార్, హరిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు శ్రీవారి ప్రసాదం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల అనంతరం ఆనవాయితీగా టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు శ్రీవారి ప్రసాదాలను బుధవారం నుంచి పంపిణీ చేయనున్నారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. తిరుపతిలోని టీటీడీ క్యాంటీన్ వద్ద జాబిలి భవనంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీటీడీ స్మార్ట్ ఐడీ కార్డు చూపించి ఒక పెద్ద లడ్డూ, ఒక వడ తీసుకోవాలని సూచించింది. పీపీఓ నంబర్ల వారీగా ప్రసాదాల పంపిణీ జరుగుతుందని వెల్లడించింది. 15, 16 తేదీలలో 164 నుంచి 5,500 పీపీఓ నంబర్ వరకు, 17న 5,501 నుంచి 7,000, 18న 7,001 నుంచి 8,500, 22న 8,501 నుంచి 10,000 వరకు, 23న 10,001 నుంచి 12,500 వరకు, 24వ తేదీన 12,501 నుంచి మిగిలిన వారికి ప్రసాదాలు అందించనున్నట్లు పేర్కొంది.

బుద్ధుని విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో నేతలు

దక్కిలి : మండలంలోని వెంబులూరు పంచాయతీ అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం గౌతమ బుద్ధుని విగ్రహం ఆవిష్కరించారు. అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి అధ్యక్షుడు గండోలు గోపాల్ ఆధ్వర్యంలో బంతేజి దమ్మానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమితి వ్యవస్థాపకుడు ఇంగిలాల రామచంద్ర రావు, నేతలు ఎరబోతు సుబ్రమణ్యం, నిజమాల ప్రసాద్, చిట్టేటి రమణయ్య, జంగిటి వెంకటయ్య, నావూరు శంకర్ పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో వైఎస్సార్‌సీపీ సమావేశం

తిరుపతి మంగళం : తిరుపతి పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్సీలు, నియోజక వర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, మున్సిపల్ చైర్మన్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ సమాచార విభాగం పిలుపునిచ్చింది.

ఎట్టకేలకు మామిడి రైతులకు రూ.4 జమ

తిరుపతి అర్బన్: ఈ ఏడాది జూన్, జూలైలో రైతుల నుంచి మామిడిని జ్యూస్ పరిశ్రమలు కొనుగోలు చేశాయి. అయితే నెల రోజుల వ్యవధిలోనే కేజీకి రూ.4 చొప్పున రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని అప్పటిలో అధికారులు వెల్లడించారు. అయితే మూడు నెలల తర్వాత మంగళవారం జిల్లాలో 5,952 మంది రైతులకు చెందిన 65014.159 టన్నుల మామిడికి ప్రభుత్వం రూ.4 చొప్పున ఇవ్వాల్సిన రూ.26 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో మామిడి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం కేజీకి రూ.12 చొప్పున రైతుకు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అయితే రైతులకు కిలో మామిడికి రూ.8 చొప్పున ఇవ్వకుండా కేవలం రూ.4 మాత్రమే చెల్లించారు. దీంతో జిల్లాలోని రైతులకు రూ.26 కోట్ల మేరకు నష్టం వచ్చింది. మరోవైపు నెల రోజుల్లో ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు నెలలు తర్వాత రూ.4 అందించారు. మొత్తంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కేజీకి రూ.12 కాకుండా రూ.8 తోనే రైతులు సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

నెత్తకుప్పంలో రోడ్డుకడ్డంగా గోడ



అడ్డంగా కట్టిన గోడను తొలగిస్తున్న పోలీసులు

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం గ్రామంలో ఓ కూటమి నాయకుడు అధికార అహంకారంతో ఊరిని అక్రమ నిర్బంధంలోకి నెట్టేశాడు. రాజకీయ కక్షలతో గ్రామంలోకి ఓ కుటుంబం రాకపోకలను పూర్తిగా నిలిపివేశాడు. గ్రామ ప్రధాన రోడ్డుకే గోడ కట్టి మూసేశాడు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనం.. స్థానికంగా జరిగిన చిన్న పంచాయితీ వివాదానికి దారితీసింది. దీంతో స్థానిక కూటమి నాయకుడు రెచ్చిపోయాడు. ఓ విలేకరి (సాక్షి కాదు) ఇంటి వద్ద ఏకంగా గోడను నిర్మించాడు. ఆ కుటుంబాన్ని గ్రామంలోకి రానీయకుండా అడ్డుకట్టవేశాడు. రోడ్డుకు అడ్డుగా గోడ కట్టేశాడు. గ్రామస్తులను కూడా నిర్బంధించాడు. బాధితులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో శాంతి భద్రతల రక్షణకు చర్యలు చేపట్టారు. వివాదం పరిష్కారం కోసం రెండు వర్గాల మధ్య చర్చలు జరిపేందుకు ప్రయత్నించారు.

బస్సులు.. తప్పవు పడిగాపులు

- కర్నూలులో ప్రధాన మంత్రి సభకు 325 సర్వీసులు
- నేటి నుంచి 17వ తేదీ వరకు ప్రయాణికులకు ఇక్కట్లు



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ సభలు నిర్వహించినా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత 5 నెలల వ్యవధిలో 6 సమావేశాలకు మొత్తం 1,170 బస్సులను తిరుపతి నుంచి తరలించడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఈక్రమంలోనే గురువారం కర్నూలులో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు సైతం జన సమీకరణ నిమిత్తం బుధవారమే జిల్లా నుంచి 325 బస్సులను తీసుకెళుతున్నారు. తిరిగి శుక్రవారం ఆ సర్వీసులు జిల్లాకు రానున్నాయి. దీంతో మూడు రోజుల పాటు ప్రయాణికులకు బస్టాండ్లలో బస్సుల కోసం పడిగాపులు తప్పని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా అన్ని డిపోల్లో మొత్తం 774 బస్సులు ఉన్నాయి. అందులో 70 బస్సులు మరమ్మతుల్లోనే ఉంటున్నాయి. మిగిలిన 700 బస్సుల్లో 325 సర్వీసులను తరలిస్తే కేవలం 375 బస్సులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటాయి. 50శాతం బస్సులను ఒక్క సభ కోసం పంపిస్తే ప్రజలు ఎంత ఇబ్బందిపడతారో కూడా ప్రభుత్వం గుర్తించడం లేదని పలువురు మండిపడుతున్నారు.

జిల్లా నుంచి తరలిన బస్సుల వివరాలు

- మే 2న : అమరావతి సభకు – 156
- మే 18న : యోగా దినోత్సవానికి వైజాగ్‌కు – 35
- మే 29న : టీడీపీ మహానాడుకు – 154
- సెప్టెంబర్ 10న : అనంతపురంలో సూపర్ సిక్స్ సభకు – 335
- సెప్టెంబర్ 19న: విజయవాడలో డీఎస్సీ ఉపాధ్యాయుల సభకు – 165
- అక్టోబర్ 15న : కర్నూలు సభకు 325

మంచి విధానం కాదు



ఎక్కడో నిర్వహించే సభలకు ఇక్కడి నుంచి బస్సులను పంపించడం మంచి విధానం కాదు. జన సమీకరణ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడం సరి కాదు. అంతగా అవసరమైతే ప్రైవేట్ బస్సులను అద్దెకు తీసుకోవాలి. అంతే కానీ ఆర్టీసీ సర్వీసులను తీసుకెళితే ప్రయాణికులు ఎంతగా అవస్థలు పడతారో పాలకులు గుర్తించాలి. ఇందులో కూటమి ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉంది. – వేణుగోపాల్, తిరుపతి

వ్యతిరేకత తప్పదు



ప్రతి దానికీ అనవసరంగా ఆర్టీసీ బస్సులను వాడేస్తూ ప్రజలను ఇబ్బంది పెడితే ప్రభుత్వంపై వ్యతిరేకత తప్పకుండా పెరుగుతుంది. ప్రయాణికులను ఈ విధంగా అవస్థలకు గురిచేయడం దారుణం. బస్టాండుల్లో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుంది. అప్పుడప్పుడు వచ్చే అరకొర బస్సుల్లో ఎక్కేందుకు యుద్ధమే చేయాల్సి వస్తుంది. జిల్లాలో ఆర్టీసీ తీరు కూడా అధ్వాన్నంగా ఉంది. – జనార్ధన్‌రెడ్డి, రేణిగుంట

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,569 మంది స్వామివారిని దర్శించుకోగా 27,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఇవేం గొడవలు బాబోయ్!



అటెండర్, డాక్యుమెంట్ రైటర్ల వాగ్వాదం



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైటర్లు

- రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మళ్లీ రగడ

రేణిగుంట: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డి, అటెండర్ తిరుమలేష్ మధ్య వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. సోమవారం సదరు అటెండర్‌తో డాక్యుమెంట్ రైటర్లు, అటెండర్ ఘర్షణ పడ్డారు. దీనికి కొనసాగింపుగా మంగళవారం జిల్లా డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ నేతలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్ తిరుమలేష్‌తో వాగ్వాదానికి దిగారు.

తిరగబడిన క్రయవిక్రయ దారులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు తిరగబడ్డారు. డాక్యుమెంట్ రైటర్లు, అటెండర్ మధ్య రోజూ గొడవలు జరుగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులు మానుకొని కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ఇలా ఘర్షణ పడటం తగదని మండిపడ్డారు. ఏదైనా ఉంటే బయట చూసుకోండని తెగేసి చెప్పారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ జోక్యం చేసుకుని డాక్యుమెంట్ రైటర్లను వెలుపలకు వెళ్లాలని ఆదేశించారు.

రైటర్ల నిరసన

జిల్లా డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నిరసన తెలిపారు. అటెండర్ తిరుమలేష్‌పై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందించారు.

తుడా వీసీకిఘనంగా వీడ్కోలు



శుభం బన్సల్‌ను సత్కరిస్తున్న తుడా అధికారులు

తిరుపతి తుడా:తుడా వీసీ శుభం బన్సల్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం ఈ మేరకు తుడా కార్యాలయంలో కార్యదర్శి శ్రీకాంత్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపికతో సత్కరించారు. తుడా అభివృద్ధికి శుభం బన్సల్ ఎనలేని సేవలందించారని కొనియాడారు. అధికారులు సుజన, దేవకికుమారి, శైలజ పాల్గొన్నారు.

గజదాడులపై ఆందోళన

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లెలో ఏనుగుల దాడులు పెరిగిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సింహాల మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పంట పొలాలు, కొబ్బరి చెట్లను ఏనుగుల నాశనం చేస్తున్నాయన్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎస్వీయూలో 16 నుంచి యువతరం

తిరుపతి సిటీ: ఎస్వీయూ వేదికగా ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు అంతర్ విశ్వవిద్యాలయ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు కల్చరల్ విభాగ సమన్వయకర్త డాక్టర్ ప్రత్తిపాటి వివేక్ తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని సుమారు 40 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. సుమారు 29 రకాల పోటీలలో వేల మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

తిరుమలలో తనిఖీలు



అనధికార వ్యక్తులు, యాచకులను బస్సులో తరలిస్తున్న దశ్యం

తిరుమల : తిరుమలలో పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 187 మంది యాచకులు, అనధికార హాకర్లను గుర్తించి తిరుపతికి తరలించారు. అలాగే 73 మంది అనుమానితుల వేలిముద్రలను సేకరించి రికార్డులను పరిశీలించారు. తిరుమలలో పనిచేసే కార్మికులను సంబంధిత యజమానులు పనులు పూర్తి కాగానే తిరుపతికి పంపివేయాలని సూచించారు అనధికార వ్యక్తులను గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.

పిడుగుపాటుకు 30 మేకలు మృతి



పిడుగుపాటుతో మృతి చెందిన మేకలు

ఓజిలి: పిడుగుపాటుకు 30 మేకలు మృతి చెందిన ఘటన ఓజిలి మండలం, భువనగిరిపాళెం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన తురక గురవమ్మ 60 మేకలను పెంచుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె కుమారుడు శ్రీనివాసులు మేత కోసం మేకలు తోలుకుని అడవి ప్రాంతానికి తరలించాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. గాలి విపరీతంగా వీయడంతో 28 మేకలు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాయి. మిగిలిన మేకలను తోలుకుని శ్రీనివాసులు ఇంటికి చేరుకున్నాడు. గాలీవాన నిలిచే సమయానికి రాత్రి కావడంతో మేకలు ఇంటికి రాలేదు. ఉదయం సమీపంలో బంధువులతో కలిసి వెదికాడు. పిడుగుపాటుకు గురై చెట్టు కిందనే 28 మేకలు మృత్యువాతపడ్డాయి. అలాగే గ్రామానికి చెందిన కొండూరు రవీంద్రరాజు, ముచ్చకాయల చంద్రమోహన్‌కు చెందిన మేకలు చెరొకటి మృతిచెందాయి. మృతి చెందిన మేకల విలువ సుమారుగా రూ.3.5 లక్షలు వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న వీఆర్‌ఏ ఘటనా స్థలిని పరిశీలించారు. తహసీల్దార్‌పద్మావతికి నివేదిక పద్మావతికి నివేదిక అందించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

తిరుపతి క్రైమ్: తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ ద్విచక్ర వాహనం కిందపడి బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రామకిషోర్ కథనం.. చౌడేపల్లి మండలం, శెట్టిపేటకు చెందిన శరత్‌బాబు జీవనోపాధి నిమిత్తం కారు డ్రైవర్‌గా కుటుంబంతో కలిసి తిరుపతి క్రాంతినగర్‌లో నివాసముంటున్నాడు. అతని కుమారుడు కె.రిత్విక్ (9) ఓ ప్రయివేటు స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 7.40 గంటలకు రిత్విక్ ఇంటి ముందర రోడ్డుపై సైకిల్ తొక్కుతున్నాడు. సదరు స్కూల్ నుంచి జీవకోన రోడ్డు వైపు అతివేగంగా వచ్చిన రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ (AP39 C9049) ఢీకొట్టింది. బాలుడి తలకు, ముఖానికి, మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించారు. విచారణలో బైక్ నడిపింది తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన కే.సంతోష్గా గుర్తించారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకిషోర్ తెలిపారు.

పత్తి గుట్టలో మట్టి దోపిడీ



పత్తిగుట్ట నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్



చంద్రగిరి ప్రధాన రహదారిపై వెళుతున్న ట్రాక్టర్

- అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
- రాత్రివేళ తరలిస్తున్న ట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి సమీపంలోని పత్తి గుట్ట పచ్చనేతలకు ఆదాయ వనరుగా మారింది. ఏడాదిగా యథేచ్ఛగా మట్టిని తవ్వకుంటూ రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. అప్పుడప్పుడూ రెవెన్యూ అధికారులు దాడులు చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ టీడీపీ నేతలు మాత్రం లెక్కచేయడం లేదు. వారం రోజులుగా రాత్రివేళల్లో అక్రమంగా పత్తిగుట్ట నుంచి వందలాది ట్రిప్పుల గ్రావెల్‌లో దోచేస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. చంద్రగిరి బీసీ హాస్టల్ సమీపంలోని సర్వే నంబరు 1479లో సుమారు 5 ఎకరాలకుపైగా పత్తిగుట్ట ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పచ్చనేతలు ఈ గుట్టను చెరబట్టారు. జేసీబీల సాయంతో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా వందలాది ట్రిప్పుల మట్టిని తరలించేస్తున్నారు. నెల క్రితం వరకు పగటి పూట అక్రమ దందా సాగిస్తున్న క్రమంలో రెవెన్యూ అధికారులు దాడులు చేయడంతో కాస్త తగ్గారు. అయితే వారం రోజులుగా గ్రావెల్ మాఫియా పడగవిప్పినట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 12 గంటల వరకు సుమారు 10 ట్రాక్టర్లు, రెండు టిప్పర్లతో మట్టి తోలేస్తున్నారు. మంగళవారం రాత్రి ఒకేసారి 10 ట్రాక్టర్లు వరుస క్రమంలో మట్టిని తరలించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టవర్‌క్లాక్ సర్కిల్ నుంచే 10 ట్రాక్టర్లు ఏకకాలంలో వెళుతున్నప్పటికీ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ గస్తీ చేస్తున్న పోలీసులు సహకారం అందించడంతోనే గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోందని ఆరోపిస్తున్నారు.

తట్టోడు గుంట దర్జాగా కబ్జా



రహదారికి ఆనుకుని ముళ్లపొదల మాటున అక్రమంగా సాగిస్తున్న గదుల నిర్మాణాలు

- ససర్వే నంబర్ 34/3లో ప్రభుత్వ కుంటభూమి ఆక్రమణ
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని రెవెన్యూ శాఖ

రామచంద్రాపురం: తిరుపతికి కూతవేటు దూరంలో ఉన్న సి.రామాపురం మండలం తట్టోడుగుంట ప్రస్తుతం కూటమి నాయకుల అక్రమ నిర్మాణాలకు కేంద్రంగా మారింది. గతంలో రైతుల సాగుకు ఆధారమైన ప్రభుత్వ కుంటభూమి కొంతమంది కూటమి నాయకుల కబ్జాలోకి వెళ్లిపోయింది. తిరుపతికి కూత వేటుదూరంలో సి.రామాపురం ఉంది, పట్టణాభివృద్ధి సంస్థలో భాగమై ఉండడం వలన మండల వ్యాప్తంగా భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో కూటమి నాయకుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. సర్వే నంబర్ 34/3లో తట్టోడు కుంట సుమారు ఐదు ఎకరాల్లో ఉంది. ఈ తట్టోడుగుంట గతంలో రామాపురం రైతులకు సాగు తాగునీరు అందించేది. కొంతమంది నాయకుల స్వార్థంతో తట్టోడు గుంటకు వచ్చే కాలువలను పూడ్చి, అక్రమ నిర్మాణాలు చేపట్టారు. తట్టోడుగుంటలో ముళ్ల పొదలు బలంగా ఉన్నాయి. రహదారికి సమీపంలో గదులు నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ భారీ ముళ్లపొదలు అడ్డుగా ఉండడం వల్ల కనిపించడం లేదు. ఇదే అదునుగా భావించిన కూటమి నాయకులు దర్జాగా గదుల నిర్మించేసి, కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులకు, ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలున్నాయి. అయితే ఈ ప్లాట్లను అమాయకులు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిబంధనల మేరకే బాణసంచా విక్రయం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ రామ్మోహన్

తిరుపతి రూరల్ : నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు సాగించాలని, అనుమతి లేకుండా అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తిరుపతి ఆర్‌డీఓ రామ్మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తహసీల్దార్లు, బాణసంచా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ భారీ శబ్దాలు వచ్చే టపాకాయలపై నిషేధం ఉందని వెల్లడించారు. ఇళ్లు, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయకూడదని తెలిపారు. పన్నులను సక్రమంగా చెల్లించాలని కోరారు. ఈ క్రమంలోనే బాణసంచా దుకాణాలను తహసీల్దార్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయా షాపుల వద్ద అగ్నిప్రమాద నివారణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.

తిరుపతి నగరంలో..

తిరుపతి నగరంలో తుడా కార్యాలయం వద్ద ఇందిరామైదానం, ఇస్కాన్ ఆలయం సమీపంలోని మైదానం, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, తారకరామా స్టేడియంలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ ఆదేశించారు.

17 నుంచి పవిత్రోత్సవాలు

– అంకురార్పణ రేపు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ తేది నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ, సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయి. పవిత్రోత్సవాల సందర్భంగా గురువారం తిరుప్పావడ సేవ, అక్టోబర్ 17 నుంచి 19 వరకు నిత్య కళ్యాణోత్సవం సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు

- ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్
- చెర్లోపల్లెలో ఎస్‌బీఐ శాఖ ప్రారంభం



నూతన శాఖను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన శాఖను సోమవారం ఆ బ్యాంకు సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ వ్యవస్థ అయిన ఎస్‌బీఐ స్థానిక ప్రజలకు మెరుగైన, విస్తృత సేవలందించేందుకు నూతన శాఖను ఏర్పాటు చేశామన్నారు. తమ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందించడం, ప్రాంతీయ ఆర్థిక సమ్మిళత లక్ష్యాలను అధిగమించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జీఎం అమరేంద్రకుమార్ సుమన్, డీజీఎం దినేష్ గులాటి, ఆర్ఎం ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లాక్కున్నారని ఆత్మహత్యాయత్నం

పాకాల : సెల్‌ఫోన్ లాక్కున్నారని మనస్తాపంతో ఓ బాలుడు (15) ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం రాత్రి పాకాల భారతంమిట్టలో జరిగింది. ఇన్‌స్టాలో చాటింగ్ చేస్తుండగా కుటుంబసభ్యులు సెల్‌ఫోన్ లాక్కోవడంతో బాలుడు వెంటనే గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. దీంతో ఆందోళన చెందిన బాలుడి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి బాలుడిని బయటకు తీసుకువచ్చారు. చేయి కోసుకుని అపస్మారకస్థితి చేరుకుని ఉండడంతో 108లో కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

అమ్మవారి ఆలయంలో.. అధికారి బరితెగింపు

- హిజ్రాతో దురుసుగా ప్రవర్తించిన జమేదారు
- దర్శన సమయంలో అసభ్య దూషణ

చంద్రగిరి : భక్తుల సేవే..భగవంతుని సేవ అనే సూత్రానికి టీటీడీ అధికారులు నీళ్లొదిలేశారు. భక్తులు ఎదురు మాట్లాడితే దాడులు చేస్తాం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ క్రమలం ఓనే తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఓ అధికారి తీరు దారుణంగా తయారైంది. భక్తులపైనే దాడులకు పాల్పడుతున్నారు. వివరాలు.. అమ్మవారి దర్శనానికి చెన్నైకు చెందిన ఆండాళ్ అనే హిజ్రా తన కుటుంబంతో మంగళవారం వచ్చింది. గర్భాలయంలో పద్మావతీదేవిని ఆండాళ్ దర్శించుకునే సమయంలో అలివేలు అనే జమేదారు దురుసుగా ప్రవర్తించింది. ఆవేశంతో హిజ్రాపై చేయి చేసుకుంది. దీంతో ఇరువురూ దూషణ పర్వానికి దిగడంతో భక్తులు దిగ్భ్రాంత్రి చెందారు. గతంలో అనేక సార్లు అలివేలు ఇదే తరహాలో భక్తులపై దాడి చేసిన ఘటనలు ఉన్నట్లు ఆలయ సిబ్బంది చెబుతున్నారు.

ఐఏఎస్‌లకు బదిలీ వీడ్కోలు



జేసీ శుభం బన్సల్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ తదితరులు



సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాను సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్ : జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న జేసీ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాను మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఇద్దరు సమర్థవంతమైన ఐఏఎస్ అధికారులు బదిలీపై వెళుతున్నారని, వారి సేవలను మరువలేమని కొనియాడారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్‌ఓ నరసింహులు, ఆర్‌డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో ఎస్‌పీఏ బృందం



కమిషనర్‌ను కలిసిన ఎస్‌పీఏ బృందం

తిరుపతి తుడా: తిరుపతిలో జోనింగ్ నిబంధనలు – శక్తి సామర్థ్య అధ్యయనంపై ఈ నెల 28న స్థానిక కచ్చపి ఆడిటోరియంలో వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమృత్ పథకం కింద పైలట్ ప్రాజెక్ట్ సర్వే వివరాలను విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ బృందం (ఎస్‌పీఏ) కమిషనర్‌ను కలిసి మంగళవారం వివరించారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖా ఆధ్వర్యంలో "ఎనర్జీ ఎఫిషెన్సీ కన్సిడరేషన్స్ ఇన్ జోనింగ్ రెగ్యులేషన్స్ – ఎ స్టడీ ఆఫ్ తిరుపతి" అనే ప్రాజెక్టును చేపట్టింది. అందులో భాగంగా ఎస్‌పీఏ బృందం ప్రధానంగా భూ సర్వేలు, గణాంకపరమైన విశ్లేషణలు, సాఫ్ట్‌వేర్ ఆధారిత అధ్యయనాల ద్వారా తుది సూచనలను సిద్ధం చేసి కమిషనర్‌కు వివరించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ అడిషనల్ ప్రొఫెసర్ జనమేజయ్, డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మూర్తి పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోండి



తిరుపతిలో ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

తిరుపతి అర్బన్: బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవాలని తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షులు విజయభాస్కర్, కార్యదర్శి ధన్వంత్‌కుమార్ డిమాండ్ చేశారు. తిరుపతిలోని కరూర్ వైశ్యాబ్యాంక్ వద్ద ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. ఉద్యోగ సంఘం నేతలు మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకుల జాతీయకరణ చేపట్టాలని పేర్కొన్నారు. క్లరికల్, సబ్‌స్టాఫ్ ఉద్యోగాల నియామకం, సీఎస్‌బీ బ్యాంకుల్లో సత్వర వేతన సవరణ, ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగుల పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగ సంఘం కమిటీ సభ్యులు జనార్దన్, యగ్నేష్‌బాబు, కేశవరెడ్డి, భాస్కర్, రేష్మ, సుమంత్, నిర్మలదేవి, పవన్‌కుమార్, వెంకటలక్ష్మి, లక్ష్మీపతి, మహేష్, శంకరరావు, నటరాజ్ పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులను రక్షించిన పోలీసులు

పాకాల : ఇద్దరు చిన్నారులను పాకాల పోలీసులు రక్షించారు. వివరాలు.. రైల్వే స్టేషన్‌లో ఇద్దరు చిన్నారులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని రైల్వే పోలీసులు పాకాల పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు చిన్నారులను పట్టుకుని రక్షించారు. వారు సత్యసాయి జిల్లా, చెన్నెకొత్తపల్లి మండలానికి చెందిన మోహన్‌రాజ్ కుమారుడు కుమ్మరవరుణ్(12), సురేంద్ర(సూరి) కుమారుడు సి.తరుణ్(11)గా గుర్తించారు. ఈ నెల 11న ఇంటి నుంచి తప్పిపోయినట్టు తల్లిదండ్రులు చెన్నె కొత్తపల్లి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాకాల పోలీసులు చెన్నె కొత్తపల్లి పోలీసులకు వివరాలు అందించారు. అనంతరం పాకాల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న చెన్నేకొత్తపల్లి పోలీసులకు చిన్నారులను అప్పగించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పాకాల పోలీసులను అభినందించారు.



చిన్నారులను చెన్నేకొత్తపల్లి పోలీసులకు అప్పగిస్తున్న పాకాల పోలీసులు

కొత్త టీచర్లకు సర్వీసు రిజిస్టర్లు పంపిణీ



నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు ఇస్తున్న అధికారులు, యూటీఎఫ్ నాయకులు

తిరుపతి సిటీ: డీఎస్సీ–2025లో టీచరు పోస్టులు సాధించిన వారు మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ, ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరారు. వారికి యూటీఎఫ్ నాయకులు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు స్వాగతం పలికి సర్వీసు రిజిస్టర్లు, సేవా పుస్తకాలను అందజేసి మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పరంజ్యోతి, నగరపాలక అధ్యక్షులు వై.హేమాద్రి, ప్రధాన కార్యదర్శి ఎస్.ఖాదర్‌బాషా, కోశాధికారి ప్రభుకుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వరలక్ష్మి, సుధ, ఢిల్లీ ప్రసాద్, మహాలక్ష్మి, పెద్ద రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్ బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి, అధ్యాపకులు

తిరుపతి సిటీ: స్థానిక అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల వేదికగా డిసెంబర్ 13, 14న నిర్వహించనున్న జాతీయ సదస్సుకు సంబంధించి బ్రోచర్లను కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, దేశం నలుమూలల నుంచి ఎంతో మంది లా విద్యార్థులు, పరిశోధకులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని, నాలెడ్జ్ షేరింగ్, నూతన అంశాలపై విద్యార్థులకు సదస్సులు మరింత జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బిజయ కుమార్ బెహెరా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఉపాధ్యక్షులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పిల్లలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంతో ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ పోషకాహార మాసోత్సవాలు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రజలతోనే దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లీబిడ్డలకు పోషకాహారం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు పీఎం పోషణ్ అభియాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. బాలామృతం. బాలామృతం ప్లస్ కార్యక్రమాలను కచ్చితంగా చేపట్టాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు. బెస్ట్‌బేబీస్‌గా ఎంపికైన పిల్లల తల్లులు, ప్రభుత్వ బాలికల వసతి గృహంలోని పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీఈఓ కేవీఎన్ కుమార్, డీఐఓ డాక్టర్ శాంతాకుమారి, టాటా ట్రస్ట్ మేనేజర్ సుబ్రమణ్యం, విజయవాహిని ట్రస్ట్ వీరబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో కలకడ మండలం, ముదియంవారి పల్లెకు చెందిన గడ్డం రవికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి ఏ.నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ కె ఆదినారాయణ కథనం మేరకు, 2018 ఫిబ్రవరి 24వ తేదీ కేవీ పల్లె పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కలకడ – జిల్లెల మంద రోడ్డు సమీపంలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒక కారు పోలీసులను చూసి దూరంగా ఆగింది. కారులోని వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు ఆ కారును తనిఖీ చేయగా కారులో 251 కిలోల 9 ఎర్రచందనం దుంగలు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు ఎర్రచందనం దుంగలను, కారును సీజ్ చేసి స్టేషన్కు తరలించారు. 2018 మార్చి 3న గడ్డం రవితో పాటు నలుగురు పోలీసుల వద్ద లొంగిపోయారు. పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం గడ్డం రవిపై మాత్రం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో నలుగురిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ అమర నారాయణ వాదించారు.